## క్లుప్తంగా

### బుద్ధావతారంలో జగన్నాథుడు



జగన్నాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : సుభద్ర,బలభద్ర సమేత జగన్నాథుడు మంగళవారం బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథుని ఉత్సవాల్లో భాగంగా మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని జగన్నాథస్వామి ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి ఆయా దేవాలయాలను భక్తులు సందర్శించారు. మునగపాకలో బుధవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా జగన్నాథుని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.

### డయేరియా, డెంగ్యూ నివారించాలి



అచ్యుతాపురంలో మానవ హారం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : డయేరియా, డెంగ్యూ నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి శ్రావ్య సూచించారు. అచ్యుతాపురం కూడలిలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దోమల పెరుగుదల, ఆవాసాలపై మందులు చల్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వేణుగోపాల్, సన్యాసిరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఏకాహం

మునగపాక: మునగపాక షిర్డీసాయి బాబా ఆలయంలో ఏకాహం నిర్విరామంగా సాగుతుంది. గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా 21వ తేదీవరకు ఆలయంలో సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి వచ్చి భజనలు, సాయి కీర్తనలు ఆలపించారు. సాయి నామస్మరణతో మునగపాక మార్మోగుతుంది. కాగా గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్ర తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సాయి బాబాను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వీరేంద్ర కోరుతున్నారు.

### 8 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో రోటరీ కంటి ఆస్పత్రి ప్రతినిధి రవిరామ్ జవహర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏఎల్‌ఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్టు రోటరీ కంటి ఆస్పత్రి ప్రతినిధి రవి రామ్ జవహర్ చెప్పారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో 46 మందికి కంటి పరీక్షలు చేసి, 8 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్టు తెలిపారు. అన్ని పరీక్షల అనంతరం వారికి ఆపరేషన్లు చేసినట్టు ఐవోఎల్ కంటి ఆపరేషన్ వైద్యులు కె.మల్లేశ్వరరావు చెప్పారు. ఆపరేషన్ అనంతరం 5రోజులకు సరిపడ మందులు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యసహాయకురాలు పి.దేవి తదితరులు పాల్గొన్నారు.

### ఫిజియోథెరపీతో ఉపశమనం

నాతవరం: దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేయడం వల్ల కొంత వరకు ఉపశమనం కలుగుతుందని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. దీనిపై వారి తల్లిదండ్రులు అవగాహన చేసుకుంటే ఇంటి వద్ద తర్ఫీదు ఇవ్వొచ్చన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు ఫిజియో థెరపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు చేస్తున్న విధంగా ఇంటి వద్ద తల్లిదండ్రులు తర్ఫీదు ఇస్తే త్వరగా సాంత్వన పొందుతారన్నారు.



# ఎక్కడి చెత్త అక్కడే...

- పత్తాలేని ఫాగింగ్
- మున్సిపాలిటీలో పడకేసిన పారిశుధ్య పనులు
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం



పట్టణంలో క్లబ్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త



రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డులో కొత్తగా వేసిన సీసీ రోడ్డుపై చిందరవందరగా ప్లాస్టిక్ వ్యర్థాలు

యలమంచిలి రూరల్: పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. మున్సిపల్ శానిటేషన్ విభాగంలో అధికారులు, సిబ్బంది తమకేమీ పట్టింపు లేదన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టణంలో 25 వార్డులున్నాయి. విలీన గ్రామాలతో పాటు వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు 98 మంది వరకు సిబ్బంది ఉన్నారు. వీరంతా పొరుగుసేవల ప్రాతిపదికన చాలాకాలంగా పనిచేస్తున్నారు. పారిశుధ్యలోపం లేకుండా వీరితో పనిచేయించాల్సిన యంత్రాంగం పట్టనట్టు వ్యవహరించడంతో పట్టణంలో ప్రధాన వీధుల్లో రోడ్లపైనే చెత్తా చెదారాలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే క్లబ్ రోడ్డులో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది.అక్కడ కుక్కలు మాంసం వ్యర్థాలను పీక్కొని తింటుండడం కనిపిస్తుంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికంగా నివాసముండే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇక రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రహదారిలో ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఇటీవల నిర్మించిన కొత్త సీసీ రోడ్డుపైనే మద్యం బాటిళ్లు, నిషేధించిన ప్లాస్టిక్ గ్లాసులు,వ్యర్థాలు చిందరవందరగా పడి ఉన్నాయి. పక్కనే అనధికారికంగా చేపల విక్రయాలు చేపడుతున్న వ్యాపారులు వ్యర్థాలను పక్కనే ఉన్న డ్రైనేజీలో పడేస్తున్నారు. దీంతో అక్కడ భరించలేనంత దుర్గంధం వస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో కూడా పరిస్థితి. పట్టణంలో ప్రధాన రహదారి పక్కనే రెండువైపులా ఉన్న డ్రైనేజీల్లో మురుగు ప్రవహించడానికి వీలు లేకుండా చెత్త పేరుకుపోయింది. కొద్ది నెలల క్రితం ఈ డ్రైనేజీల్లో సిల్టు తొలగించినప్పటికీ వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను డ్రైనేజీల్లో వేస్తున్నారు. చెత్తను శుభ్రం చేయకపోవడంతో డ్రైనేజీలు పూడుకుపోయాయి. దీంతో వర్షపు నీరు,ప్రజలు, వ్యాపారులు సాధారణ అవసరాలకు వాడుకునే నీరు సాఫీగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. లక్షలాది రూపాయలు వెచ్చించి తీయించిన డీసిల్టు పనులు వృథా అయ్యాయి. మరోవైపు చెత్తచెదారాలు పేరుకుపోవడంతో దోమలు, ఈగలు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి. పటిష్టమైన పారిశుధ్య చర్యలు తీసుకోకపోతే వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది.

**పత్తాలేని ఫాగింగ్**

మున్సిపాలిటీలో క్రమం తప్పకుండా చేయాల్సిన ఫాగింగ్‌ను మొక్కుబడిగా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటి లార్వా ఆయిల్ బాల్స్ వేయడం లేదు. బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ చల్లడం లేదు. ఇక వీధుల్లో చెత్త సేకరణ కూడా సక్రమంగా చేపట్టడం లేదు. చెత్తకు నిప్పు పెట్టకూడదని నిబంధనలున్నా ఎక్కడికక్కడ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని గాంధీనగర్‌కి చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు తెలిపారు. ఇక ఖాళీ స్థలాల్లో తుప్పలు,పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోతున్నాయి. చిట్టడవులను తలపిస్తున్న ఈ ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో పాములు, విషపురుగులు రోడ్లు, సమీపంలో నివాస గృహాల్లోకి వస్తున్నాయి. దోమల బెడద కూడా ఎక్కువైంది. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధులు వస్తున్నప్పుడు తప్ప అవసరమైనచోట పరిశుభ్రత మెరుగుపరిచేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో చెత్తకుప్పలు

### చర్యలు తీసుకుంటాం



పారిశుధ్యం మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రస్తుత పనులపై సమీక్ష జరిపి మరింత మెరుగైన సేవలందించి పారిశుధ్యం మెరుగుపరుస్తాం. రెండు ఫాగింగ్ యంత్రాలు పనిచేస్తున్నాయి. దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయడానికి ప్రయత్నిస్తాం. పారిశుధ్య విభాగం పనితీరు మెరుగుపర్చుకోవడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేస్తాం. పారిశుధ్యం మెరుగుపర్చడంలో ప్రజల సహకారం కూడా అవసరం.

డి.ప్రభాకరరావు,
ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

## బస్‌కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య చర్యలు



బస్‌కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలను నిలిపివేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు



చేపలు విక్రయించిన ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మున్సిపల్ శానిటరీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

యలమంచిలి రూరల్ : యలమంచిలి బస్‌కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలకు బ్రేక్ పడింది. ఇక్కడ రోడ్డు పక్కనే విచ్చలవిడిగా చేపల అమ్మకాల వలన ప్రయాణికులు, స్థానికులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఈ నెల 14న బస్‌కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య లోపం పేరుతో సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. ఇటీవల జరిగిన యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యను వార్డు కౌన్సిలర్లు లేవనెత్తారు. దీంతో అక్కడ చేపల అమ్మకాలను నిలిపివేయాలని చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆదేశించారు. అయినప్పటికీ బస్‌కాంప్లెక్స్ వద్ద చేపల అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్న వైనంపై సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో స్పందించిన ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకర్రావు చర్యలు తీసుకోవాల్సిందిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావుకు సూచించారు. ఈ మేరకు మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్కడకు వెళ్లి చేపల వ్యాపారులను అక్కడి నుంచి పంపించివేశారు. చేపలు విక్రయిస్తున్న ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రపరిచారు. మళ్లీ ఇక్కడ చేపలు విక్రయించడానికి ప్రయత్నిస్తే జరిమానా విధిస్తామని వ్యాపారులను హెచ్చరించారు.

## శానిటేషన్‌పై దృష్టి సారించాలి

నక్కపల్లి : మండలంలో వివిధ గ్రామాల్లో నెలకొన్న శానిటేషన్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా , వైరల్ జ్వరాలు ప్రభలుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాలువల్లో పూడికతీత, క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బావులు, రక్షిత మంచినీటి పథకాల వల్ల క్లోరినేషన్ చేయించాలని సూచించారు. సచివాలయాల్లో ఈ సర్వీసెస్ నిమిత్తం వసూలు చేసిన పెండింగ్ అమౌంట్స్ వెంటనే ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని, పెన్షన్ల పంపిణీ పై సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా సచివాలయాలకు హాజరు కావాలని, హాజరు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా తీసుకోవాలన్నారు. ఉపాధి పథకంలో కూలీలకు 100 రోజుల పని కల్పించడం, మస్తర్లు తనిఖీలు, ఇంటిపన్నుల వసూళ్లు వంటి వాటిపై కూడా దృష్టిసారించాలన్నారు. పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోపిఆర్‌డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

## 19న ఐటీఐలో ఉద్యోగ మేళా

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈ నెల 19 న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోప, డ్రాఫ్ట్‌స్‌మాన్ సివిల్ ట్రేడుల్లో పాసైన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనాలని సూచించారు. జె.వై. సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టీసీఎస్ హైదరాబాద్, టెక్ మహీంద్రా, చెన్నై, క్యూసీప్ టెక్నాలజీస్, హైదరాబాద్, హాబెల్ బెల్లోస్, దువ్వాడ, విశాఖపట్నం, ఆర్‌హెచ్‌ఐ మాగ్నెసిటా, పరవాడ, సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, యూ -2, గుడివాడ (5) , యెన్. ఎస్.ముని స్పీడోమీటర్ మేనుప్యాక్చర్స్, శ్రేసిటి, హెట్రో లాబ్స్, నక్కపల్లి, వరుణ్ మోటార్స్, విశాఖపట్నం, లక్ష్మి మోటార్స్, విశాఖపట్నం, కియా మోటార్స్ విశాఖపట్నం, వంటి సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సందడిగా గోరింటాకు సంబరం



కళాశాలలో గోరింటాకు పెట్టుకుంటున్న విద్యార్థినులు



గోరింటాకు పెట్టుకున్న అరచేతులు చూపుతున్న విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు

యలమంచిలి రూరల్: ఆషాఢం..బాలికలకు..మహిళలకు ఎంతో ఇష్టమైన మాసం.వారి అరచేతులు ఎర్రని ముద్ద మందారాలయ్యే సమయం. సంస్కృతీ, సంప్రదాయాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో ఓ ప్రైవేటు కళాశాలలో గోరింటాకు సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు అందరూ ఒక చోట చేరి చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. గోరింటాకు పెట్టుకోవడం వల్ల చేతులకు అందంతోపాటు, ఆరోగ్యకరమైన ప్రయోజనాలున్నాయని మహిళా అధ్యాపకులు విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఎర్రగా అందంగా మారిన అరచేతులు చూపిస్తూ విద్యార్థినులంతా ఫోటోలు, సెల్ఫీలు తీసుకుని వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహితులు, బంధువులకు పంపించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

## గ్రామాల్లో ఈవోఆర్డీ పర్యటన



నాగులాపల్లిలోని రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ వెంకటలక్ష్మి

మునగపాక : నాగులాపల్లి, ఒంపోలు గ్రామాల్లో మంగళవారం ఈవోఆర్డీ వెంకటలక్ష్మి పర్యటించారు. ఆయా గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలతో పాటు రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించారు. రక్షిత మంచినీటి పథకాలను ఎప్పటికపుడు శుభ్రం చేయించాలని, డయేరియా సోకకుండా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. అలాగే సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, నరసింగరావు పాల్గొన్నారు.

## వరి నారు సంరక్షణకు సూచనలు



గెడ్డపాలెంలో వరి నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



వాకపాడులో యంత్ర సామగ్రిని పరిశీలిస్తున్న ఏడీ

ఎస్.రాయవరం : వ్యవసాయంలో ప్రభుత్వం రాయితీతో సమకూరుస్తున్న యంత్ర సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి సహాయ సంచాలకులు బి.ప్రభాకర్ అన్నారు. వాకపాడు, గెడ్డపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ బృందంతో మంగళవారం పర్యటించారు. ఖరీఫ్ నాట్లు కు సిద్ధమయ్యే రైతులకు సూచనలు ఇచ్చారు. నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు 10 నుంచి 12 రోజులు ముందుగా దమ్ము మడులు సిద్ధం చేసుకోవాలన్నారు. దమ్ముల్లో అవసరమయిన మోతాదుల్లో భాస్వరం, పోటాషియం వంటి ఎరువులు చల్లుకోవాలన్నారు. నారుమడులు పురి విచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు నిలకట్టాలన్నారు. అనంతరం యంత్ర సేవా పథకం కింద పరికరాల వినియోగాన్ని పరిశీలించారు. లబ్ధి పొందిన రైతులు నుంచి సమాచారం తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వ్యవసాయాధికారి సౌజన్య, ఏఈవో నూకరాజు తదితరులు ఉన్నారు.

## నారుమడిలో జింకు ధాతు లోపం నివారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని దిమిలి, మురకాడ వ్యవసాయ క్షేత్రాల్లో మంగళవారం జిల్లా వనరుల కేంద్రంలో ఆధ్వర్యంలో వాతావరణ ఆధారిత వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గ్రామీణ విత్తనోత్పత్తి కింద మడి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. నారుమడిలో జింకు ధాతు లోపం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎటువంటి మందులు పిచికారీ చేయాలో సూచించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో విజయ, ఏవో సుమతి, సాయి,సంతోషి కుమారి,రామారావు,మేఘన పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం : సైతారుపేట గ్రామంలో సర్వసద్ది పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది స్టాఫ్ డయేరియా, డెంగ్యూ నివారణ మాసోత్సవాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో విరివిగా వర్షాలు ప్రారంభ అయ్యాయని, ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని చెప్పారు. బయట ఆహారం తీసుకోవడం తగ్గించి , ఇళ్లలో వండుకునే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే డెంగ్యూ బారిన పడకుండా ఇళ్లలో నిల్వ నీటిని ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీపీ క్లస్టర్ పి.ఎస్.వి.ఎస్ ప్రసాద్ ఏఎన్‌ఎంవో వేణు , అంగన్‌వాడీ ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా

4 గ్రామాల్లో అధికారుల పరిశీలన



అప్పన్నదొరపాలెంలో ఇసుక తవ్వకం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



తూటిపాలలో నిల్వ ఉన్న ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తహసీల్దార్ మురళీమోహన్‌రావు తెలిపారు. మండలంలోని తూటిపాల, అప్పన్నదొరపాలెం, కొండలఅగ్రహారం, మాకవరపాలెం ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను పోలీస్, పంచాయతీ రాజ్, మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలోని నదులు, గెడ్డలు, జిరాయితీ భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. తూటిపాలలో ఇసుక నిల్వలను పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు పెడతామన్నారు. ఇసుక అక్రమ తరలింపు, తవ్వకాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇదే విషయమై పోలీసులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు నిఘా ఉంచాలని ఆదేశాలిచ్చామన్నారు. ఎస్ఐ రామకృష్ణారావు, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

## స్పర్శలేని మచ్చలు కుష్టువ్యాధికి సంకేతాలు



మాట్లాడుతున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: శరీరంపై స్పర్శలేని మచ్చలను కుష్టువ్యాధికి సంకేతాలుగా గుర్తించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. దీనిపై ప్రజలకు వైద్య సిబ్బంది వివరించాలన్నారు. కుష్టువ్యాధిగ్రస్తులను గ్రామాల్లో గుర్తించే కార్యక్రమంపై వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలకు ఆస్పత్రిలో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ శరీరంపై రాగి రంగు మచ్చలు ఉంటే, వైద్య సిబ్బందికి సమాచారాన్ని ఇవ్వాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రారంభ దశలోనే కుష్టువ్యాధికి మెరుగైన వైద్యం అందితే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. గ్రామాల్లో ఇటువంటి లక్షణాలు గల వారిని గుర్తించే కార్యక్రమాన్ని ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ చేపట్టాలన్నారు. పీహెచ్‌ఎన్ ప్రమీల, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

## దుకాణాల కేటాయింపుపై విచారణ

కోటకోట: స్థానిక సంతబయల ప్రాంతంలో పంచాయతీ దుకాణాల కేటాయింపుపై మంగళవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి విచారణ జరిపారు. వీటి కేటాయింపుపై స్థానిక కూరగాయల వ్యాపారుల నుంచి ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో పరిశీలించి దుకాణాలను ఎలా కేటాయించారనే విషయమై దుకాణదారులను కలిసి ఆరా తీశారు. దుకాణాలను ఏ విధంగా కేటాయించారనే విషయమై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను ప్రశ్నించగా పంచాయతీ తీర్మానం అనుసరించి కేటాయించినట్లు బదులిచ్చారు. దుకాణాల కేటాయింపు విషయమై సమగ్ర నివేదిక అందివ్వాలని ఈవోఆర్‌డీ సోమరాజును డీపీవో ఆదేశించారు.

## బ్యాంకు లింకేజీ రుణాలతో ఆర్థికాభివృద్ధి

ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి

కె.కోటపాడు: డ్వాక్రా సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలతో ప్రతీ సభ్యురాలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని పెందుర్తి ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాలను తీసుకోవడంతోపాటు వాటిని ప్రతి నెలా బ్యాంక్‌కు సకాలంలో వాయిదా పద్ధతిలో చెల్లించాలని సూచించారు. ప్రతి నెలా గ్రామ సంఘాల సమావేశం నిర్వహించడంతోపాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. స్త్రీనిధి మేనేజర్ జగదీశ్వరి, ఏపీఎం పి.వెంకటలక్ష్మి, సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సన్యాసిరావు, సీతం నాయుడు, సింహాచలంనాయుడు, సురేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: విద్యార్థుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే, ఆ ప్రభావం చదువుపై పడుతుందని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. స్థానిక హాస్టల్‌లో విద్యార్థులకు మంగళవారం ఆమె వైద్య పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న వారికి మందులు పంపిణీ చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మార్పు కారణంగా జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులకు విధిగా రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. తర్వాత సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేశామన్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కాచి చల్లార్చిన నీళ్లు తాగాలన్నారు. నిల్వ ఉన్న ఆహారం తినరాదన్నారు. ప్రధానంగా కొంతకాలంపాటు చేపలు, మాంసం పూర్తిగా తగ్గించి ఆకుకూరలు, పప్పులు దినుసులు తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.